
సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 6 । ఆగస్టు । 2025



జలగలతో గొర్రెలకు ప్రమాదం

గొర్రెలు, పశువుల్లో పొట్ట జలగలతో ప్రమాదం పొంచిఉంది. విరేచనాలతో నీరసించి మరణాలు సంభవించవచ్చని పశువైద్యులు చెబుతున్నారు. 10లో ▸



ముఖం చాటేసిన పులస

ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకూ దొరికే పులస ఈ సంవత్సరం దొరకడం కష్టంగా మారింది. అరకొరగా దొరకడంతో ధరలు ఆకాశన్నంటాయి. 10లో ▸



కారు ఢీకొని డ్రైవర్ మృతి

ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురంలో ఆటోను కారు అతి వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. 10లో ▸

పశ్చిమలో పేకాట దందా

- టీడీపీ నేతల కనుసన్నల్లో శిబిరాల నిర్వాహకులు
- భీమవరంలో ఒక్క ఆటకు రూ.1.60 లక్షలు
- జిల్లాలో నిత్యం రూ.5 కోట్లకు పైగా టర్నోవర్
- ఉభయ గోదావరి జిల్లాల నుంచి పేకాటరాయుళ్లకు ప్రత్యేక ఆహ్వానాలు
- తణుకులో రోజూ మారుతున్న శిబిరాలు
- పాలకొల్లు, ఉండి, తాడేపల్లిగూడెంలోనూ ఇదే దందా

సాక్షి ప్రతినిధి, ఏలూరు : పశ్చిమ గోదావరి జిల్లాలో పేకాట దందా మూడు షోలు.. ఆరు పుల్లులుగా సాగుతోంది. డ్రాప్‌నకు రూ.20 వేలు, మిడిల్ డ్రాప్‌నకు రూ.40 వేలు, ఫుల్ కౌంట్‌కు రూ.1.60 లక్షలు.. ఇదీ జిల్లా ప్రధాన కేంద్రమైన భీమవరంలో సాగుతున్న ప్రత్యేక పేకాట శిబిరం లోని ప్రధాన గేమ్. టీడీపీ నేతలే నిర్వాహకులు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసులకు వారం మామూళ్లు ఫిక్స్ చేసి ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పేకాట జాతర మరుసటి రోజు తెల్లవారుజామున మూడు గంటల వరకు నిర్విరామంగా సాగుతోంది. భీమవరం సహా పశ్చిమ గోదావరిలోని ప్రధాన పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాకపోతే నిర్వాహకుల స్థాయిని బట్టి సభ్యులు, ఆట స్థాయి మారుతుంది.



భీమవరంలో స్పెషల్ శిబిరం

భీమవరంలోని మురుగు కాల్వ గట్టు సమీపంలో ఓ శిబిరం భారీ స్థాయిలో సాగుతోంది. పట్టణంలోని ఓ ప్రముఖ క్లబ్‌లో సభ్యుడిగా ఉన్న వ్యక్తి నిర్వాహకుడుగా మారి ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు ఆట సాగుతుంది. 11 మంది సభ్యులతో మూడు కట్టలతో కనష్ట బోర్డు.. ఏడుగురితో మరో బోర్డును ఏర్పాటుచేసి గంటకు 7–10 ఆటలు ఆడిస్తున్నారు. ఓకుకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిగే బోర్డు అందుబాటులో పెట్టారు. ఓకుకు రూ. 20 వేలు చొప్పున.. ఫుల్ కౌంట్ పడితే రూ.1.60 లక్షలు చెల్లించే గేమ్‌కు రూ.5 లక్షలు డిపాజిట్, మరో రూ.4.80 లక్షలు అంటే మూడు ఫుల్‌గేమ్‌ల మొత్తం వెరసి రూ.9.80 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. డిపాజిట్ మొత్తం కిలోమీటరు దూరంలో ఉండే మరో వ్యక్తి ప్రత్యేకంగా లాకర్లు, ఇతర జాగ్రత్తలతో నగదును సేకరించి టోకెన్లు ఇచ్చి శిబిరానికి పంపుతారు. మరో ప్రత్యేక అంశమేమిటంటే.. సదరు నిర్వాహకుడు సభ్యుడిగా ఉన్న క్లబ్‌లో గెస్ట్‌ల పేరుతో కొందరిని అక్కడి ఆటకు పంపించడం, గెలుపోటములు పూర్తయ్యాక వెళ్లే సమయంలో స్లిప్ ద్వారా వసూళ్లు, చెల్లింపులు చేస్తున్నారు. భీమవరంలో పేకాట నిర్వహణలో సుదీర్ఘ అనుభవం ఉన్న సదరు వ్యక్తి ఆటకు రూ.4 వేలు చొప్పున నిర్వహణ ఖర్చులు వసూలు చేస్తున్నాడు. రోజుకు సగటున రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు శిబిరం నిర్వాహకులకే దక్కుతోంది. వీటిల్లో పోలీసులకు, స్థానిక ప్రజాప్రతినిధికి వారం, నెలవారీలు మామూళ్లను ఖరారుచేసి పంపుతూ జోరుగా శిబిరం నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సన్నిహితులే చూస్తుండటంతో ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లా నుంచి పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తున్నారు. స్థానిక ఎస్ఐ మొదలుకుని ఉన్నతాధికారుల వరకు ఈ విషయం తెలిసినా పొలిటికల్ గేమ్ పేరుతో పట్టించుకోకపోవడం గమనార్హం. పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదుల పెరగడంతో కొద్ది రోజులుగా భీమవరంలో శిబిరానికి తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చారు. మరో అనువైన ప్రదేశం కోసం వేట సాగుతున్నట్లు సమాచారం

ఒక్కొక్కచోట ఒక్కోలా

తణుకు మండలంలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఒకరోజు పైడిపర్రులో, మరోరోజు తేతలి, ఇంకోరోజు వేల్పూరులో.. ఇలా ప్రతిరోజూ ఒక్కో ప్రాంతంలో పెట్టి ఎప్పుడూ వచ్చే వంద మంది జూదరులకు మెసేజ్‌ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. ఉండి, ఆకివీడు, పాలకొల్లులో ఎంపిక చేసిన రొయ్యల చెరువుల వద్ద నిత్యం పెద్దఎత్తున జూదక్రీడ కొనసాగుతోంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పెదతాడేపల్లి, పెంటపాడు, రూరల్‌లో వారానికి రెండు ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిచోటా ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో పోలీసుల దాడులు, కేసుల ఊసు లేకపోవడం గమనార్హం.

టీడీపీ కూటమి సర్కారు రాగానే..

పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెంలలో పదుల సంఖ్యలో అనధికారిక శిబిరాలు.. అనుమతుల పేరిట పాలకొల్లు, భీమవరంలో క్లబ్బుల్లో పేకాట నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పేకాటపై ఉక్కుపాదం మోపి క్లబ్‌లను మూసివేశారు. దీంతోపాటు జూద క్రీడలను పూర్తిగా నిషేధించి వందల కేసులు నమోదు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతలే పేకాట శిబిరాల నిర్వాహకులుగా అవతారమెత్తి మూడు ముక్కలాట మొదలుకుని కనష్ట గేమ్ వరకు భారీగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరితో పాటు కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి కూడా పేకాటరాయుళ్లను పెద్దఎత్తున ఆహ్వానించి నిత్యం రూ.5 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తూ నిర్వాహకులే నిత్యం లక్షల్లో గడిస్తున్నారు.

న్యూస్‌రీల్

అక్రమ ఆయుధాలు స్వాధీనం



పాలమూరులో పోలీసుల అదుపులో ఆయుధాలు కలిగి ఉన్న వ్యక్తులు

పెనుమంట్ర: ఎస్పీ ఆదేశాల మేరకు పెనుమంట్ర ఎస్సై కె స్వామి తన సిబ్బందితో పాలమూరులో ఆక్వా చెరువుల వద్ద తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 5 నాటు తుపాకులు, 10 కిలోల గన్‌పౌడర్, 3 కిలోల గోళీలు స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు. ఆక్వారైతులు ఎవరైనా అక్రమ ఆయుధాలు కలిగి ఉంటే వాటిని వెంటనే పోలీసులకు అప్పగించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆర్.విజయ్‌కుమార్ హెచ్చరించారు.

ఆక్వా జోన్ సర్వే పూర్తి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆక్వా జోన్ సర్వేలో నిబంధనలు కచ్చితంగా పాటించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం మత్స్య, గృహ నిర్మాణ శాఖలపై సమీక్షించారు. నాచు పెంపకం (సీవీడ్) పై ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు నిపుణులతో శిక్షణ ఇప్పించి ప్రోత్సహించాలని, ఈ కార్యక్రమాన్ని రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమృద్ధిగా పండే వ్యవసాయ భూమిని ఆక్వా జోన్‌లోకి ప్రతిపాదించవద్దని అధికారులకు సూచించారు.

క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

ఏలూరు(మెట్రో): అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనల ప్రకారం గడువు పొడిగించామని జేసీ పి.ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు జూన్ 30, 2025 లోపు దరఖాస్తుచేసి క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. సదరు క్రమబద్ధీకరణ రుసుం 45 రోజుల్లో చెల్లిస్తే 10 శాతం రాయితీ, తదుపరి 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 99668 48055 నెంబరులో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి

ఏలూరు (టూటౌన్): ఫోన్లను అంగన్‌వాడీ కార్యాలయంలో అప్పగించిన వారిపై వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు తమ ఫోన్‌లను ఐసీడీఎస్ కార్యాలయాల్లో అప్పగించారన్నారు. ఫోన్లు పనిచేయడం లేదని చెప్పినా వినకుండా టార్గెట్ల పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెట్ సిగ్నల్స్ లేకపోవడం, సర్వర్ పనిచేయకపోవడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారుల బెదిరింపులకు అంగన్‌వాడీలు లొంగరన్నారు. సమస్య సానుకూలంగా పరిష్కరించాల్సిన అధికారులు ఇంతవరకూ స్పందించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే అంగన్వాడీలకు 5 జీ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని యాప్‌లను కలిపి ఒక యాప్‌గా మార్చాలని, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పుస్తకాల కోసం ఉరుకులు పరుగులు

దెందులూరు: ప్రభుత్వ తాజా ఆదేశాలపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికే యాప్‌లతో ఇబ్బంది పడుతున్న తమకు బోధనకు సమయం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం ఏలూరు సుబ్బమ్మ దేవి పాఠశాలకు వెళ్లి విద్యార్థుల పుస్తకాలు తీసుకెళ్లాలని ఫోన్‌లకు మెసేజ్‌లు పంపారు. పాఠశాల పనివేళల్లో పుస్తకాలు మోయడానికి ఉపాధ్యాయులను కేటాయించడం ఏంటని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో వాహనాల ద్వారా మండలంలో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేసి ఆ సెంటరుకు పుస్తకాలను సరఫరా చేసేవారు. ఆ కేంద్రం నుంచి ఉపాధ్యాయులు వెళ్లి తెచ్చుకునేవారు. ఇప్పుడు ఆ పద్ధతికి స్వస్తి చెప్పి జిల్లా కేంద్రానికి వెళ్లి పుస్తకాలు తెచ్చుకోమనడంపై మండిపడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో సింగిల్ టీచర్ పనిచేస్తున్నారని.. ఉన్న ఒక్క టీచరు పుస్తకాలు తేవడానికి జిల్లా కేంద్రానికి వెళ్తే విద్యార్థుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదేశాలు పాటించకపోతే మళ్లీ ఏం చేస్తారో అని తప్పని పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలపై ఏలూరు వెళ్లి పుస్తకాలు తీసుకువచ్చామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పుస్తకాలు తీసుకోవడానికి ఏలూరు రమ్మని మెసెజ్‌లు ఇచ్చిన సంగతి వాస్తవమేనని ఏలూరు రూరల్ మండలం ఎంఈఓ అరుణ్ పేర్కొన్నారు.

తణుకు ప్రభుత్వాసుపత్రిలో పారిశుద్ధ్య పనులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో మురుగు నీటి నిల్వ ప్రాంతాన్ని శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి స్పందన

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో మురుగునీరు తిష్టతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సాక్షి దినపత్రికలో 'సర్కారు దవాఖానాలో మురుగునీరు తిష్ట' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాకర్లమూడి సాయి కిరణ్, ఆర్ఎంవో డాక్టర్ ఎ.తాతారావు సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి జేసీబీ ద్వారా డ్రెయినేజీలో ఉన్న మురుగును తొలగించే చర్యలకు చేపట్టారు. మురుగునీరు ప్రవహించేలా పనులు పూర్తిచేయించడంతోపాటు ఆస్పత్రి ఆవరణలో బ్లీచింగ్ చిమ్మించారు.

ఉద్యోగుల సమస్యలపై చర్చకు ప్రత్యేక కార్యక్రమం



భీమవరంలో టీ తాగుతూ మాట్లాడుకుందాం రండి కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీంద్రరాజు

భీమవరం: రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టీ తాగుతూ మాట్లాడుకుందాం రండి అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు రవీంద్రరాజు చెప్పారు. మంగళవారం భీమవరం పట్టణంలోని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో జిల్లా అధ్యక్షుడు యాళ్ళ మోహన రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులంతా సమస్యలపై చర్చించి ప్రభుత్వం వద్ద పేరుకుపోయిన రూ.30 వేల కోట్ల బకాయిలు, పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్సీ కమిషన్ వంటిపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఉద్యోగులను చైతన్య పర్చడానికి టీ తాగుతూ మాట్లాడుకుందాం రండి కార్యక్రమం శ్రీకారం చుట్టామన్నారు. వారానికో సమస్యపై ఉద్యోగులంతా టీ తాగుతూ చర్చిస్తామని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వైఖరిని తెలియచేస్తామని రవీంద్రరాజు చెప్పారు. సంఘం జిల్లా కార్యదర్శి జక్రయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఉమర్ అలీషా, ఉపాధ్యక్షులు రాజేష్ కుమార్, మానస తదితరులు పాల్గొన్నారు.

పీ4 మార్గదర్శులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): డీఆర్డీఏ, డ్వామా శాఖలతో ప్రేరేపితులై ముందుకు వచ్చిన పీ4 మార్గదర్శులతో మంగళవారం కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వివిధ మార్గాలుద్వారా సేవలందిస్తున్న సమాజ నిర్దేశకులందరినీ ఒకే తాటిపై తీసుకువచ్చి మార్గదర్శకులుగా నమోదు చేసి బంగారు కుటుంబాలకు సేవలందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మార్గదర్శకులుగా నమోదు కావడానికి మనసున్న ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. నమోదయ్యే సందర్భంలో ఏదైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టి తీసుకురావాలన్నారు. ప్రతి సచివాలయంలో నమోదుకు ఉచితంగా అవకాశం కల్పించామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్గదర్శిగా ఆర్థికంగా ఒక్కటే కాదని, సేవా తత్పరతతో చేసే ఏ కార్యక్రమం అయినా నిర్వహించవచ్చన్నారు.

వలకు చిక్కిన భారీ చేప



పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద గోదావరిలో జాలర్లకు భారీ బొచ్చు చిక్కింది. మంగళవారం గోదావరిలో పులస కోసం వేటాడుతుండగా సుమారు 12 కేజీల బరువున్న బొచ్చు పడింది. దీనిని దొంగరావిపాలెం చేపల మార్కెట్‌లో అమ్మకానికి ఉంచారు.

\- పెనుగొండ

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి



భీమవరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్లు తక్షణం రద్దు చేసి ట్రూఅప్ చార్జీలు ఉపసంహరించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ప్రజా వేదిక పిలుపులో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి దగ్గరలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రజావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. అదానీతో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వాడుకున్న విద్యుత్‌కు అదనపు రుసుం ఇప్పుడు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను రాష్ట్రం అమలు చేయడం దారుణమని పెంచిన విద్యుత్ భారాలు ఉపసంహరించకపోతే మరో పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఏఐసీటియు, టీయుసీసీ నాయకులు లంక కృష్ణమూర్తి, కొల్లాబత్తుల మహంకాళి మాట్లాడుతూ.. విద్యుత్ ఒప్పందాలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎలక్ట్రికల్ జేఈకి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ప్రజా వేదిక నాయకులు బి.వాసుదేవ రావు, జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, ఇంజేటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లోనూ ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

భీమవరం: జిల్లాలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల నిల్వ, రవాణా వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదలచేశారు. యుద్ధంలో ఉపయోగించే ఆటోమేటిక్ తుపాకులు వంటివి కలిగి ఉండడం అత్యంత తీవ్ర నేరమన్నారు. ఆయుధాలు, రివాల్వర్లు, పిస్టళ్లు వంటి సాధారణ ఆయుధాలను కూడా సరైన లైసెన్స్ లేకుండా కలిగి ఉండటం నేరమన్నారు. అనుమతులు లేకుండా బాంబులు, ఇతర పేలుడు పదార్థాల తయారీ, నిల్వ, రవాణా తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని ఎస్పీ తెలిపారు. ఆక్వా చెరువుల యజమానులు పక్షులను తరిమికొట్టడానికి లైసెన్స్ లేని తుపాకులను ఉపయోగిస్తున్నట్లు గుర్తించామని ఆక్వా రైతుల వద్ద ఉన్న లైసెన్స్ లేని తుపాకులను వెంటనే పోలీసులకు అప్పగించాలన్నారు. అక్రమ ఆయుధాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ అస్మి కోరారు.


నా జీవితం తెరిచిన పుస్తకం

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ఇద్దరు కూటమి నాయకులు మాట్లాడుకున్న ఆడియో సంభాషణకు తనకు సంబంధం ఏంటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రశ్నించారు. పోల వరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏడాదిలో రూ. 100 కోట్లు సంపాదించారని టీడీపీ, జనసేనకు చెందిన అగ్ర నాయకులు మాట్లాడుకుంటే వారిని ప్రశ్నించకుండా చిర్రి బాలరాజు తనపై బురద చల్లాలని చూడటం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. 20 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన తనను ఎంత సంపాదించావో బయటకు తీస్తానని చిర్రి బాలరాజు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని తెల్లం బాలరాజు స్పష్టం చేశారు. తన తండ్రి తెల్లం చిన్న వడ్డీ వార్డు మెంబర్‌గా, సర్పంచ్‌గా జెడ్పీటీసీగా, ఎంపీపీగా అనేక పదవులు చెయ్యడమే కాకుండా పోలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేశారని అన్నారు. తనది రాజకీయ కుటుంబమని చెప్పారు. 3 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన తనను ఉపఎన్నికల్లో కూడా అత్యధిక మెజారిటీతో ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. చిర్రి బాలరాజు నిక్కర్లు వేసుకునే రోజుల్లో తాను ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ఉన్నానని తెల్లం బాలరాజు తెలిపారు. తనమీద వచ్చిన ఆరోపణను పక్కదోవ పట్టించేందుకే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తనకు మద్యం షాపులు లేవని, ఇసుక, మట్టిలో కమిషన్ తీసుకోలేదని స్పష్టం చేశారు.

పరాకాష్టకు పీ-4

- మార్గదర్శులుగా ముందుకురాని కూటమి నేతలు
- ఉద్యోగులనే మార్గదర్శులుగా మ్యాపింగ్‌కు ఒత్తిళ్లు
- భీమవరంలో 26 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు
- ఎంపీడీవోలు, ఇతర అధికారులపైనా తీవ్ర ఒత్తిడి



సాక్షి, భీమవరం: పేదరిక నిర్మూలన కోసమంటూ చంద్రబాబు సర్కారు చేపట్టిన పీ–4 కార్యక్రమం వేధింపులు పరాకాష్టకు చేరాయి. సర్కారు పిలుపునకు సంపన్నుల నుంచి స్పందన రాక ఉద్యోగులను బాధ్యులను చేసే పనిలో ఉంది. మార్గదర్శులుగా మ్యాపింగ్‌కు ఒత్తిడి తెస్తోంది. పీ–4 అమలులో సర్వే లక్ష్యం చేరుకోలేదంటూ సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అట్టడుగు పేద కుటుంబాలను సంపన్నుల సాయంతో అభివృద్ధి చేసేందుకు పబ్లిక్- ప్రైవేట్ - పీపుల్ పార్టనర్‌షిప్ (పీ–4) కార్యక్రమం తెచ్చినట్టు ప్రభుత్వం చెప్పుకుంటోంది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 4,92,292 కుటుంబాలకు పలు వడపోతల తర్వాత 64,940 కుటుంబాలను అర్హులుగా ఎంపిక చేశారు. సంపన్నులను మార్గదర్శులుగా చేర్పించి ఆయా కుటుంబాలను వారికి అనుసంధానించాలి. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆర్థిక చేయూత, లేదా జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను నేర్పించడం ద్వారా వారి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలి.

ఉద్యోగుల పైనే భారం

బంగారు కుటుంబాలు, మార్గదర్శుల గుర్తింపు, అనుసంధానం మొత్తం బాధ్యతలను ప్రభుత్వం ఉద్యోగ వర్గాలపైనే మోపింది. ఈ నెల 15 నాటికి జిల్లాలో 15 వేల మంది మార్గదర్శులను గుర్తించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పీ–4లో భాగస్వాములుగా చేరి బంగారు కుటుంబాలను బాగుచేసేందుకు కూటమి పక్షాల్లోని సంపన్న నేతలు ఆసక్తి చూపడం లేదు. శనివారం నాటికి జిల్లాలో 1,700 మంది మాత్రమే మార్గదర్శులుగా రిజిస్టర్ చేసుకున్నారు. వీరికి 35 వేల కుటుంబాలను మ్యాపింగ్ చేశారు. ఉన్నతస్థాయి నుంచి వస్తున్న ఒత్తిడితో త్వరితగతిన మిగిలిన కుటుంబాల మ్యాపింగ్ పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఉన్నతాధికారులు నిరంతర సమీక్షలు చేస్తున్నారు. పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, పెద్ద రైతులు, రైస్ మిల్లర్స్, విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలు, మద్యం, ఎరువుల షాపుల యజమానులు, డీలర్లు తదితర వర్గాల వారితో సమావేశాలు ఏర్పాటుచేసి మార్గదర్శులుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరుతున్నారు. పెద్దగా ఫలితం కనిపించకపోవడంతో మార్గదర్శుల భారాన్ని ప్రభుత్వం ఉద్యోగ వర్గాలపై మోపుతోంది. ఒక్కో కుటుంబాన్ని మ్యాపింగ్ చేసుకోవాలంటూ వస్తున్న ఒత్తిళ్లతో ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. నైపుణ్యాలను నేర్పించే ఆప్షన్‌లో ఒక్కో ఉద్యోగి ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకోమంటున్నారని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. ఏడాదికి ఒక్కో ఉద్యోగి కనిష్ఠంగా దత్తత కుటుంబానికి రూ.5 వేలు సాయం అందించాలని, ఈ మేరకు తమ జీతం నుంచి మినహాయించుకుంటుందన్న ఆందోళన వారిని వెంటాడుతోంది.

ఆదిలోనే తిప్పికొట్టిన ఉపాధ్యాయ సంఘాలు

పీ–4 అమలులో టీచర్లను భాగస్వాములను చేసే ప్రయత్నాలను ఉపాధ్యాయ సంఘాలు ఆదిలోనే తిప్పికొట్టాయి. ఉపాధ్యాయుల రిజిస్ట్రేషన్‌కు ఏలూరు విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్రవ్యాప్తంగా సంఘ నాయకులు ఖండించారు. సంపన్నవర్గాలకు చెందిన పీ–4 అమలుకు మధ్య తరగతి శ్రేణిలో ఉండే ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల వారిపై భారం మోపడం సరికాదని, వేరే కుటుంబాలను దత్తత తీసుకుని సాయపడే పరిస్థితి ఉండదనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలంటూ ఫ్యాప్టో చురకలంటించింది. ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనలకు సిద్ధంకావడంతో ఉత్తర్వులను విద్యాశాఖ వెనక్కి తీసుకుంది.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్

పీ–4 సర్వే లక్ష్య సాధనలో నిర్లక్ష్యంగా ఉన్నారంటూ భీమవరం మున్సిపాల్టీకి చెందిన 26 మంది సచివాలయ అడ్మిన్, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ ఉద్యోగులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసుల జారీచేయడం చర్చనీయాంశంగా మారింది. పింఛన్ల పంపిణీ, రకరకాల సర్వేల పేరిట క్షణం తీరిక లేకుండా పనిచేస్తుంటే నోటీసులు ఇవ్వడం సరికాదని ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లాలోని మిగిలిన మున్సిపాల్టీల్లోనూ ఈ తరహా ఒత్తిళ్లు అధికంగా ఉన్నట్టు చెబుతున్నారు. పేదలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే నేరుగా వారిని ఆదుకోవాలని, ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



భవనం వరండాలో గ్యాస్ బండ మంటలు

పాలకొల్లు సెంట్రల్: పూలపల్లి గ్రామంలో ఓ ఇంటిలో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించగా సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం గ్రామంలోని గంటాలమ్మ ఆలయం వద్ద నివాసం ఉంటున్న గంట సత్తిబాబు భార్య స్వరాజ్యలక్ష్మి మంగళవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే ఆమె కేకలు వేయగా స్థానికులు పరుగున వచ్చి మంటలతో ఉన్న గ్యాస్ బండను బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆలస్యం అయ్యి ఉంటే బండ పేలిపోయేదని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సుమారు రూ.20 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఆటల పోటీలు వాయిదా

ఏలూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చేపట్టిన ఆటల పోటీలు అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. తదుపరి జిల్లా జట్ల ఎంపిక, పోటీల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

భీమవరం: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు మంగళవారం చెప్పారు. వన్‌టౌన్ పరిధిలో ఈనెల 4వ తేదీ రాత్రి ఎస్సైలు బి.వై కిరణ్‌కుమార్, ఎస్‌వీవీఎస్ కృష్ణాజి సిబ్బందితో కలిసి కొత్త బస్టాండ్ ప్రాంతంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న కారు, ఆటో డ్రైవర్లతోపాటు 9 మంది మోటార్‌సైకిల్ వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు. నిందితుల్లో ఏడుగురిని మంగళవారం స్పెషల్ జ్యుడిషియల్ 2వ తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఎంవీఎస్ రాజారావు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఆసుపత్రి వద్ద ఆందోళన



ప్రైవేట్ ఆసుపత్రి వద్ద బాలిక బంధువుల ఆందోళన

జంగారెడ్డిగూడెం: నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతోపాటు తమపై దాడికి పాల్పడ్డారని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద బాధితులు మంగళవారం ఆందోళన చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై షేక్‌జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టి.నరసాపురం మండలం గండిగూడానికి చెందిన యర్రగొర్ల రాజేష్ కుమార్తె పునర్విక‌శ్రీ జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతుండడంతో జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం ఈనెల 3వ తేదీన వచ్చారు. ఆసుపత్రి ప్రధాన వైద్యుడు కాకుండా వేరొక వైద్యుడితో గత రెండు రోజులుగా చికిత్స అందిస్తున్నారని, బాలిక కోలుకోకపోవడంతో ప్రధాన వైద్యుడిని ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించడంతో పాటు, ఆసుపత్రి సిబ్బందితో కలిసి రాజేష్‌ను నిర్బంధించి కొట్టారు. బంధువుల సహాయంతో రాజేష్ బయటకు వచ్చి ఫిర్యాదు చేశాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ముఖం చాటేసిన పులస

- గోదావరిలో జాడలేని పులస
- అరకొర లభ్యతతో ఆకాశాన్నంటిన ధరలు

పుస్తులమ్ముకొనైనా పులస తినాలనే నానుడు గోదావరి జిల్లాల్లో ఉంది. కానీ ఈ ఏడాది పుస్తులమ్ముకొన్నా.. చేపల రాజు పులస దొరికే పరిస్థితి లేదు. గోదావరికి వరద ఉధృతి అంతంత మాత్రంగా ఉండడంతో పులస జాడ కనిపించడం లేదు. దీంతో పులస ప్రియులు జిహ్వాను చంపుకోవాల్సి వస్తోంది. ప్రత్యేక వలలు సైతం ఎంచుకొని, నలుగురైదుగురు జాలర్లు వెళ్లినా ఒకటి రెండు మాత్రమే చిక్కడంతో గిట్టుబాటు కాక జాలర్లు సైతం తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



పెనుగొండ: గోదావరి జిల్లాలకు సంక్రాంతి పండుగ ఎంత ప్రత్యేకమో.. వరదనీటితో ఎగురుకొంటూ వచ్చే అతిథి పులస అంతే విశిష్టతను కలిగి ఉంటుంది. ఎర్రనీరు వచ్చిందంటే చాలు సముద్రం నుంచి ఎగురుకొంటూ గోదావరిలో కలసి నామాంతరం మార్చుకొని పులసగా పిలువబడే చేపలరాజు ఈ ఏడాది చిక్కడం కష్టసాధ్యంగా మారింది. ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకూ ఇబ్బడి ముబ్బడిగా దొరికి, దీపావళి వరకూ అరకొరగా దొరికే పులస ప్రస్తుతం దొరకడం కష్టంగా మారింది. దీంతో ఆశలు వదులుకొన్న జాలర్లకు, పులస ప్రియులకు గోదావరికి రెండు మూడు పర్యాయాలు వరద నీరు రావడంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

హిల్సా పులసగా నామాంతరం

సముద్రంలో హిల్సాగా పిలవబడే చేపజాతి పసిఫిక్ మహాసముద్రంలో జీవిస్తుంటుంది. ప్రతి ఏటా గోదావరికి ఎర్రనీరు వచ్చే సమయానికి ఖండాంతరాలు ఈదుకొంటూ గోదావరికి వచ్చి సంతతిని వృద్ధి చేసుకొని తిరిగి సముద్రంలోకి వెళుతుంటాయి. ఈ సమయంలో జాలర్లకు చిక్కి కాసులు కురిపిస్తాయి. పులసలు వచ్చే సమయానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి జాతీయ రహదారిలో గోదావరి జిల్లాల మీదుగా ప్రయాణించే ప్రతి ఒక్కరూ పులస రుచిని చూడడానికి మక్కువ చూపుతుంటారు. దీంతో దీని ధర ఘనంగానే ఉంటుంది. పులస విరివిగా దొరికే ప్రతి ఏటా కిలో రూ.1500 నుంచి రూ.3 వేల వరకూ పలుకుతుంది. సైజు పెరిగే కొద్దీ ఒక్కో పులసను పోటీ పడి పులస ప్రియులు రూ.25 వేలుకు కొనుగోలు చేసిన దాఖలాలు ఉన్నాయి. అయితే, ఈ ఏడాది వీటి జాడే కరువైంది. దీంతో కిలో రూ.3 వేలు నుంచి అమ్మకాలు సాగిస్తున్నారు.

సముద్రపు పోటే కారణమా?

పులసల జాడ తగ్గడానికి సముద్రపు పోటు ఓ కారణంగా చెబుతున్నారు. గోదావరి జలాలు సముద్రంలోకి కలిసేటప్పుడు ఉండే తీయదనం, ఎర్రదనం తగ్గడంతో పులసల జాడ తక్కువైందని భావిస్తున్నారు. ఉప్పు జలాలు ప్రస్తుతం ఇటు సిద్ధాంతం వరకూ, అటు జొన్నాడ ఆలమూరు వరకూ ప్రభావం చూపుతుండడంతో పులస మార్గానికి ఆటంకం కారణం కావచ్చునని భావిస్తున్నారు. ఇసుక తవ్వకాలు భారీగా ఉండడంతో సముద్రపు జలాలు గోదావరిలోకి నానాటికీ బాగా చొచ్చుకు వచ్చి గోదావరి ప్రవాహ ప్రాంతం కలుషితమైందని అంటున్నారు. దీంతో పులస మార్గానికి ఆటంకం కలుగుతుందంటున్నారు.

ఆగస్టుపైనే ఆశలు

సాధారణంగా గోదావరికి ఆగస్టు మధ్యమంలో వరద ఉధృతంగా వచ్చే అవకాశం ఉండడంతో ఇటు పులసల ప్రియులు, అటు జాలర్లు ఆశలు పెట్టుకొన్నారు. అయితే, ఎగువ ప్రాంతాల్లోనూ వర్షాభావ పరిస్థితులు ఉండడంతో వారి ఆశ నిరాశగా మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయి.



పులసల దుకాణం

మార్కెట్‌ను ముంచేస్తున్న ఇలసలు

పులస జాడ అంతంతమాత్రంగానే ఉండడంతో జాతీయ రహదారిలో పులసల స్థానంలో ఒడిస్సా నుంచి వచ్చిన ఇలసలు ముంచేస్తున్నాయి. అసలైన పులస ఎర్రనీరులో ఈదుకొంటూ వచ్చినపుడు పులసపై ఎర్రటి జాడ కనిపిస్తూ ఉంటుంది. దీనిని గుర్తించి తీసుకోవలసి ఉంటుంది. పులసలు తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి ప్రారంభమై ఆత్రేయపురం, విజ్జేశ్వరం, జొన్నాడ ఆలమూరు, సిద్ధాంతం, కోడేరు, యలమంచిలి వరకూ జాలర్ల వలకు చిక్కుతుంటాయి. పులసకు, ఇలసకు తేడాను గోదావరి వాసులు గుర్తించినా, ఇతర జిల్లాల నుంచి జాతీయ రహదారిలో పయనించే వాహనదారులు గుర్తించే అవకాశం లేదు. దీంతో ఇలసలనే పులసలుగా కొందరు అమ్మకాలు సాగిస్తున్నారు. వీటి ధరా అధికంగానే ఉండడంతో ధర చూసి పులసగా భావిస్తూ మోసపోతున్నారు. సిద్ధాంతం, జొన్నాడ ఆలమూరు వంటి ప్రాంతాల్లోనూ పులసలు అరకొరగా దొరుకుతుండడంతో కొందరికి మాత్రమే అసలైన పులస దక్కుతుంది.

కూరా ప్రత్యేకమే



పులస కూర తయారీ ప్రత్యేకమే. సాధారణంగా చేపల కూర ఒకటి రెండు రోజులు మించి ఉండే అవకాశాలు ఉండవు. అయితే, పులస కూర వారంకు పైగా నిలువ ఉంటుంది. దీని కోసం ప్రత్యేకంగానే తయారీ చేస్తుంటారు. పులస కూర తయారీలో వెన్నతో పాటు, ఆవకాయ ఊట, కుమ్ముడు ఆముదం వేసి వండుతారు. దీంతో పులస ముక్క కన్నా, పులుసే అమోఘమంటూ లొట్టలు వేసుకొని మరీ తింటారు పులస ప్రియులు.

వైభవంగా శ్రీవారికి ఏకాదశి ఉత్సవం



తొళక్క వాహనంపై దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో మంగళవారం రాత్రి శ్రీవారికి తిరువీధి సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చకులు పూజాధికాలను జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

నేడు ఆట్యా-పాట్యా జిల్లా జట్ల ఎంపిక

భీమవరం: పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం స్కూల్లో ఈనెల 6వ తేదీన జిల్లా స్థాయి ఆట్యా-పాట్యా జూనియర్ బాలురు, బాలికల సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు ఆట్యా-పాట్యా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి కిరణ్ వర్మ చెప్పారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9, 10 తేదీల్లో ఒంగోలులో జరిగే 10వ జూనియర్ రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికకు జనవరి 1, 2008 తరువాత పుట్టినవారు అర్హులని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేది ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో ప్రమాదానికి కారణమైన కారు



కారు ఢీకొట్టింది ఈ ఆటోనే

ద్వారకాతిరుమల: ముందు వెళుతున్న ఆటోను కారు అతి వేగంగా ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ద్వారకాతిరుమల మండలం, లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం . పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన చోదిమెళ్ళ విజయరాజు(40) ఆటో నడుపుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే అతడు మంగళవారం మధ్యాహ్నం జేఎంఆర్ హాస్పిటల్ గురించి మైక్ ద్వారా ప్రచారం చేస్తూ, భీమడోలు నుంచి ద్వారకాతిరుమల వైపు వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి చెన్నైకు చెందిన అయిత సురేష్ కారును అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ విజయరాజును స్థానికులు హుటాహుటీన ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విజయరాజు భార్య దేవమాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ఏఆర్‌డీజీకే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేటలోని ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ. కాంతి జయకుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 8వ తరగతి చెందిన కే. భార్గవి 58 కేజీల విభాగంలో తృతీయ స్థానం, కే.మేఘన 63 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, 9వ తరగతి విద్యార్థిని ఎం.పావని 44 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, సీహెచ్. కీర్తన 58 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, ఎస్‌డీ మహీన్ 48 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, ఎం.దీక్షిత 44 కేజీల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. పదో తరగతి విద్యార్థిని సీహెచ్.హారిక రెడ్డి 63 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, ఎస్.విహారిక 77 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, జీ. పవిత్ర 58 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, పీ.ఇందు 44 కేజీల విభాగంలో తృతీయ స్థానం, ఎం.అనూష 53 కేజీల విభాగంలో తృతీయ స్థానం, షేక్. ఆశాజ్యోతి 77 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. అలాగే అథ్లెటిక్స్‌లో కిలోమీటర్ విభాగంలో జే. పల్లవి ప్రథమ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులు తోట శ్రీనివాస్ కుమార్, అబ్బ దాసరి జోజి బాబు, ఇతర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, పీఈటీలు

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



మణికంఠ మృతదేహం

తణుకు అర్బన్: విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన మంగళవారం తణుకు మండలం కొమరవరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉండ్రాజవరం మండలం చివటం గ్రామానికి చెందిన పిప్పిరిశెట్టి మణికంఠ (24) కొమరవరం గ్రామంలోని లక్ష్మీ గణేష్ నగర్‌లో ఒక ఇంట్లో విద్యుత్ లైన్‌ల పనుల్లో ఉండగా తెగిపడి ఉన్న విద్యుత్ వైరు గమనించకుండా తాకడంతో అతడికి విద్యుత్ షాక్ తగిలింది. దీంతో గాయాలపాలైన మణికంఠను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తణుకు పట్టణానికి చెందిన బిల్డర్ వాసుకూరి వెంకట సుబ్బారావు నిర్మిస్తున్న భవనానికి సంబంధించి ప్లంబింగ్, ఎలక్ట్రిషన్ పనుల నిమిత్తం చివటం గ్రామానికి చెందిన కోలా ప్రసాద్ అనే వ్యక్తికి సబ్ కాంట్రాక్ట్ ఇచ్చారు. అతని వద్ద పనిచేస్తున్న మణికంఠ విధుల్లో ఉండగా విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్ట్

భీమవరం: పాతమద్యం కేసులో ఎండీపీఎల్ ముద్దాయి కాకినాడ జిల్లా తుని పట్టణం సీతారాంపురానికి చెందిన వీర్ల దుర్గా ప్రసాద్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు చెప్పారు. అతడిని ఫస్ట్ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా నరసాపురం సబ్‌జైల్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రకాశ్

భీమవరం: ప్రతి వినియోగదారుడు సూర్యఘర్ పథకంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ టి. సూర్యప్రకాశ్ ఆదేశించారు. ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్)గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం భీమవరం వచ్చిన ఆయన ఎస్ఈ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు వారి ఇళ్లపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం ఉంటే నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఏ సబ్ స్టేషన్ల పరిధిలో అంతరాయాలు వస్తున్నాయో అడిగి, వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్‌ను సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వో ఎం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా, ఎలక్ట్రానిక్స్ మీడియా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రంశెట్టి గిరిజాపతి మాట్లాడుతూ గత ఏడాది కాలంగా జర్నలిస్టు అక్రిడిటేషన్లను మూడు నెలలకు ఒకసారి పొడిగించడంతో కొత్తగా అక్రిడిటేషన్లు తీసుకునేవారికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అర్హత గల జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, హెల్త్ ఇన్స్యూరెన్స్ స్కీమ్ అమలు వంటి డిమాండ్స్ తక్షణం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ నాయకులు వంగల లింగమూర్తి, కేఎస్ఆర్‌కే గోపాలకృష్ణ, బి రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి కమ్మిలి హనుమంతరావు, ఎస్ సత్యనారాయణ, విజయరాజు పాల్గొన్నారు.

పిల్ల జలగలతో గొర్రెలకు ప్రమాదం



పశువులు

జంగారెడ్డిగూడెం: గొర్రెలు, పశువుల్లో పొట్ట జలగల వలన చాలా నష్టాలు కలుగుతాయి. అందులో ముఖ్యంగా పిల్ల పొట్ట జలగల వల్ల గొర్రెల్లో విరేచనాలు కలిగి, నీరసించి మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. కుంటలు, చెరువులు పక్కన తేమ గల ప్రాంతాల్లో నాచు ఉన్న ప్రాంతాల్లో నత్తలు ఉంటాయి. గొర్రెలను ఆ ప్రాంతాల్లో మేపడం వలన అవి అక్కడి నీరు తాగడం ద్వారా గొర్రెలకు ఈ వ్యాధి సోకుతుందని పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ తెలిపారు. ఇవి పొట్ట గోడల్లో స్థావరం ఏర్పాటు చేసుకుని పోషక పదార్థాలను పీల్చడం ద్వారా పశువుకు నష్టాన్ని చేకూర్చుతాయని, గొర్రెల పెంపకందారులు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

వ్యాధి వ్యాప్తి

పొట్ట జలగల గుడ్లు పేడ ద్వారా బయటకు విసర్జించబడి, నీటిలోనికి చేరినప్పుడు గుడ్లు పగిలి అందులోని లార్వా దశ (మిరసిడియం) నత్తల శరీరంలోకి ప్రవేశించి, నత్తల్లో కొంత అభివృద్ధి చెంది సర్కేరియా దశలో బయటకు విసర్జించబడతాయి. వీటితో కలుషితమైన గడ్డి, నీటి ద్వారా గొర్రె శరీరంలోనికి ప్రవేశించి, ముందుగా చిన్న ప్రేగుల లోపల పొరలకు చేరుకుని, పోషక పదార్థాలను ఎక్కువగా పీల్చుకుని, 3 నుంచి 5 వారాల్లో పెద్ద జలగలుగా అభివృద్ధి చెందుతాయి. రూమెన్‌లో స్థావరం ఏర్పరుచుకుని 7 నుంచి 14 వారాల తరువాత గుడ్లు పెడతాయి. ఆ గుడ్లు పేడ ద్వారా బయటకు విసర్జింపబడి ఇతర పశువులకు వ్యాపిస్తాయి.

వ్యాధి లక్షణాలు

పిల్ల పొట్ట జలగలు చిన్న ప్రేగుల మొదటి భాగమైన డ్యుమోడినము గోడ లోపలి పొరల్లో స్థావరం ఏర్పరుచుకుని, పోషక పదార్థాలను ఎక్కువగా పీల్చుకోవడం వలన గొర్రెలు బాగా క్షీణించి, నీరసించి పోతాయి. గొర్రెల్లో ఆకలి లేమి, నీరు ఎక్కువగా తాగడం, దుర్వాసనతో కూడిన నీళ్ల విరేచనాలు, దవడ కింద భాగంలో నీరు చేరడం, శరీర కుహరంలలో నీరు చేరడం అతిసారం, రక్తహీనత లక్షణాలు కనిపిస్తాయి. దవడ కింద వాపు సాయంత్రం కనబడి ఉదయానికి తగ్గుతుంది. ఈ వ్యాధి వల్ల గొర్రెల మందల్లో 80 శాతం వరకు మరణాలు సంభవించవచ్చు. కొన్ని పర్యాయాలు పిల్ల పొట్ట జలగలు అధిక సంఖ్యలో సోకడం వల్ల నీళ్ల విరేచనాలు కలిగి అకస్మాత్తుగా చనిపోయే అవకాశం ఉంది. కంటి లోపలి మ్యూకస్ పొర రక్తహీనత వల్ల తెల్లగా పాలిపోయి ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ

పిల్ల పొట్ట జలగ వ్యాధి సోకినప్పుడు పేడలో జలగ గుడ్లు కనిపించవు. కాని కొన్ని సందర్భాల్లో పిల్ల పొట్ట జలగలు పేడలో కనిపిస్తాయి. కావున వ్యాధి లక్షణాలు, శవపరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. శవ పరీక్ష చేసినప్పుడు డ్యుమోడినం లోపలి మ్యూకస్ పొర పాలిపోయి, అక్కడక్కడ రక్తపు చుక్కలు కనిపిస్తాయి. డ్యుమోడినం లోపలి మ్యూకస్ పొరల నుంచి సేకరించిన పదార్థంను సూక్ష్మదర్శిని ద్వారా పరీక్షించిన కనిపిస్తాయి.

చికిత్స

సాధారణంగా పొట్ట జలగల నివారణకు ఉపయోగించే మందుల వలన పిల్ల పొట్ట జలగల నివారణ జరగదు. వీటి నివారణకు నిక్లజమైడు 100 మి.గ్రాలు ఒక కిలో శరీర బరువుకు చొప్పున లేదా ఆక్సిక్లోజనైడు 18.7 మి.గ్రాలు ఒక కిలో శరీర బరువుకు చొప్పున రెండు రోజుల వ్యవధిలో రెండు మోతాదులు ఇవ్వాలి. అతిసారం అధిగమించడానికి రక్తంలోనికి సెలైన్‌లను ఎక్కించాలి. రక్తహీనత నివారించడానికి ఇనుపధాతువుతో కూడిన మందులు ఇవ్వాలి. కాలేయం సాధారణ స్థితికి చేరుకోవడానికి మందులు ఇవ్వాలి. బాక్టీరియా క్రిములు చేరకుండా ఉండటానికి అవసరమైతే యాంటి బయోటిక్ మందులు ఇవ్వాలి.

చెరువుల్లోని నత్తలను నాశనం చేయాలి



వ్యాధి సోకిన ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లోని నీరు తాగనీయకూడదు. అవసరమైతే చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి. పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలి. చెరువుల్లోని నత్తలను నాశనం చేయాలి. గొర్రెలకు సమతుల్యమైన పోషకాహారం అందించాలి. పరిశుభ్ర వాతారణం కల్పించాలి. – బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

సీతారాముని ఆలయంలో చోరీ



వేలిముద్రలు దొరక్కుండా హుండీపై గుడ్లు పగులగొట్టిన దొంగలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీసీతా రామస్వామి ఆలయంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులోని సీతా రామస్వామి ఆలయ తలుపులు తెరిచేందుకు మంగళవారం ఉదయం అర్చకులు శ్రీనివాసులు వెళ్లగా తలుపులు తాళాలు పగులగొట్టి ఉండడం, సీసీ కెమెరాలు ధ్వంసం కావడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. హుండీ కోసం వెతకగా ఆలయానికి అనుకుని ఉన్న ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో లభించింది. అలాగే పాఠశాలలోని పలు గదుల తాళాలు సైతం పగులగొట్టి ఉన్నాయి. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని ఎస్సై జబీర్ పరిశీలించారు. ఆలయ ఈవో కలగర శ్రీనివాస్ మంగళవారం ఫిర్యాదుచేశారు. కాగా, చోరీ చేసిన హుండీపై వేలి ముద్రలు పడకుండా దొంగలు కోడిగుడ్లు పగులగొట్టి వేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆలయ వాచ్‌మన్‌ను ఈవో తన వాహనానికి డ్రైవర్‌గా వినియోగించుకోవడంతో సోమవారం రాత్రి అతడు విధులకు హాజరు కాలేదని తెలిసింది.

ద్విచక్ర వాహనాల చోరీపై ఫిర్యాదు

ఉండి: రెండు ద్విచక్ర వాహనాల చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోడూరు మండలం జగన్నాథపురానికి చెందిన కడలి బాబీ జూన్ 10వ తేదీన మహదేవపట్నంలో రొయ్యల పట్టుబడికి వచ్చాడు. పని ముగించుకుని మద్యం దుకాణం వద్ద వాహనాన్ని నిలిపి లోనికి వెళ్లి బయటకు వచ్చేసరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేశారు. అలాగే పెదపుల్లేరులో గత నెల 19వ తేదీ రాత్రి నిచ్చెనకొలను కృష్ణ తన ఇంటివద్ద ద్విచక్రవాహన్ని పెట్టాడు. మరోసటి రోజు ఉదయానికి వాహనం కనిపించలేదు. ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి



కెసముద్రపుగట్టులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: రైతులందరూ ఖచ్చితంగా ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. మంగళవారం అత్తిలి మండలంలోని కె.ఎస్.గట్టు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ఏ ఏ రకాలు ఊడ్చారో, ఆ రకాలు వివరాలను వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. రైతులందరూ విధిగా పంటల బీమా చేయించుకోవాలని చెప్పారు. వ్యవసాయ సహాయకులు మేరి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

25 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 25 మందికి వైద్యసేవలు అందచేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు రోగులకు వైద్యసేవలందించి, ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి నిరుపేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, సభ్యులు మద్దా అలివేలు మంగమ్మ, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెంటపాడు: పెరిగిన ధరలకు అనుగుణంగా పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డీపీవోను కోరారు. ఈ సందర్భంగా పెంటపాడు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కలిశారు. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. కళింగ లక్ష్మణరావు సమస్యలను డీపీవోకు వివరించగా డీపీవో మాట్లాడుతూ కార్మికుల జీతభత్యాల విషయంలో నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా అందజేయాలన్నారు.

ఎస్వీఎస్ఎస్ కళాశాల పాలకవర్గ సమావేశం

అత్తిలి: స్థానిక ఎస్వీఎస్ఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంఘం సర్వసభ్య సమావేశం కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. పాలకవర్గ అధ్యక్షుడిగా దాసం గోవిందరావు, ఉపాధ్యక్షుడిగా బుద్దరాతి భరణి ప్రసాద్, కార్యదర్శిగా మద్దాల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి దిరిశాల సూర్య ప్రభాకరరావు, కోశాధికారిగా యడ్లపల్లి భద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 36 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమణమూర్తి, పి.శ్రీ రామ్ శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ షబానా పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చేసుకోండి

తాడేపల్లిగూడెం: అనధికార లే అవుట్లు, ప్లాట్లకు క్రమబద్ధీకరణ అర్హత గడువు పొడిగిస్తు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. జూన్‌లోపు రిజిస్ట్రేషన్ కాబడిన అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకొనుటకు నిబంధనలు విధించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో సిటిజన్ లాగిన్ ద్వారా లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ ద్వారా అవసరమగు డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్లాట్లు క్రమబద్ధీకరణ వల్ల చట్టభద్రత వస్తుందని చెప్పారు. ఎల్ఆర్ఎస్ స్కీంపై ఎటువంటి సందేహాలు ఉన్నా పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం హెల్ప్ డెస్క్ నెంబర్ 96661 43317ను సంప్రదించాలని కోరారు.

నేడు మిగులు సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 6న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఓసీ-1, బీసీ(సీ) 3, ఎస్టీ 3, 10వ తరగతిలో బీసీ(సీ) 2, బీసీ 2, ఎస్టీ మూడు, జూనియర్ ఎంపీసీ ఎస్సీ(మాల) 4, బీసీ (సీ) 2, జూనియర్ బైపీసీ ఎస్సీ(మాల) 2, సీనియర్ ఎంపీసీ ఎస్సీ (మాదిగ) 07, బీసీ(సీ)5, బీసీ 1, సీనియర్ బైపీసీ ఎస్సీ (మాల) 1 రిజర్వు కాబడినట్లు వివరించారు. ఇతర వివరాలకు 9704550050ను సంప్రదించాలన్నారు.

ప్రశ్నార్థకంగా ప్రభుత్వ పాఠశాలల మనుగడ

- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ప్రైవేట్‌కు పెరిగిన అడ్మిషన్లు
- మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలలు



తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో మూతపడిన మండల పరిషత్ పాఠశాల

తాడేపల్లిగూడెం రూరల్: రాను రాను ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యే నిదర్శనంగా తెలుస్తోంది. తాడేపల్లిగూడెం మండలంలో 70 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, గత ఏడాది 6031మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. ప్రస్తుతం 5,066మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. దీన్ని బట్టి గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 965 తగ్గిందని స్పష్టమవుతుంది. ఇటుకులగుంట, జగ్గన్నపేట, కృష్ణాపురం, అప్పారావుపేట, మాధవరం నెం.1, నెం.2, దండగర్ర తదితర గ్రామాల్లో మొత్తం 11 పాఠశాలల్లో పది మంది లోపు విద్యార్థులు విద్యనభ్యసించడం గమనార్హం. కాగా, నవాబుపాలెం, తాళ్లపాలెం, ఆరుగొలను నెం.1 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడం విశేషం. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం తల్లికి వందనం పేరిట రూ.13వేలు జమ చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరినట్లు తెలుస్తోంది. ఒక్క ఆరుగొలను మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది 50మంది ఉండగా, ఈ ఏడాది అడ్మిషన్లు లేవు. దీంతో పాఠశాల మూతపడింది.

> **కాన్వెంట్లకు వెళ్లిపోవడంతో ఖాళీ**
>
> 
>
> పాఠశాలలు పునఃప్రారంభంలోనే తల్లికి వందనం సొమ్ములు జమ కావడంతో గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ఖాళీ అయింది. గతంలో విద్యార్థులతో కళకళలాడే పాఠశాల నేడు నిశ్శబ్దంగా మారింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
>
> – కర్రి చిట్టెమ్మ, ఆరుగొలను, తాడేపల్లిగూడెం మండలం

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ అప్పారావు

అత్తిలి: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొత్తగా విధుల్లో చేరిన 10 మండలాలకు చెందిన 35 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం అత్తిలి మండల పరిషత్ కార్యాలయం లో మంగళవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు డాక్టర్ కె సీహెచ్ అప్పారావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీకే మల్లికార్జునరావు, కోర్స్ డైరెక్టర్ జె.కనక దుర్గ, స్థానిక ఇంచార్జి ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు బాధ్యతలను, రోజువారి పని కొలతలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

సూపర్ సిక్స్ ఇవ్వకుండా చంద్రబాబు మోసం



తణుకు 14వ వార్డులో మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న వార్డు నాయకులు

తణుకు అర్బన్: బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తణుకు 14, 21 వార్డుల్లో వార్డు నాయకులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలను తెలిపే విధంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడాది గడిచిపోయినా ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోయారని, కొత్త పింఛన్లు ఇవ్వలేదని, తల్లికి వందనం కొందరికే వేశారని, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి సంక్షేమ పథకాలు ఇంతవరకు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేశారని పార్టీ నాయకులు అన్నారు. చంద్రబాబు మోసం, వంచన తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దున్నాల ఉమామహేశ్వరావు, మల్లుల సత్యనారాయణ, శ్రీనివాస్, రామాంజనేయులు, యారబాటి రామకృష్ణ, షేక్ జిలాని, పైడి సాయి సూర్య, నాసరి పార్ధసారధి, ఆదివిష్ణు ఈశ్వరకుమార్, ఎస్.శ్రీను, డోల ఆదినారాయణ, ఎస్.సీతారాం, వి.వెంకన్న, బిరుదుకోట చింతన్న, కాకరపర్తి ఆంజనేయులు పాల్గొన్నారు.

తల్లి ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యం



కావలిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: తల్లి ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యమని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ తల్లి మొదటి పాలు బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదగడానికి ఉపకరిస్తాయన్నారు. బిడ్డ పుట్టిన అరగంట లోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా తల్లి పాలు అందించాలన్నారు. తదుపరి ప్రత్యామ్నాయ ఆహారాన్ని అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, హెచ్‌వీ మెర్సీ, పీహెచ్ఎన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు. అలాగే కృష్ణాయపాలెం గ్రామంలోని తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే.శ్రీదేవి, సచివాలయ కార్యదర్శి వై.హరికిషోర్, జీఎంఎస్‌కే బేబి రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది

అత్తిలి: శిశువుకు తల్లిపాలు తాగించడం వల్ల రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పిఠాపురం నేతృత్వంలో డాక్టర్ ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, ఏఎస్ఆర్ హోమియో వైద్య కళాశాల, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు వల్ల కలిగే ప్రయోజనాలపై బల్లిపాడు గ్రామ ఆశ్రమ శాఖలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ తల్లిపాల యొక్క ప్రాముఖ్యత, తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాలు వల్ల పొందే లబ్ధి, గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలు వివరించారు. బిడ్డకు తల్లిపాలు పట్టించడం ద్వారా జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. పీఠం కార్యకర్త శివన్నారాయణ మాట్లాడుతూ స్త్రీశిశు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఉచిత కుట్టు శిక్షణ, స్త్రీ సాధికారత మహిళ స్వయం సమృద్ధికి పీఠం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ హోమియోవైద్యకళాశాల వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, సెక్రటరీ మనోజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, పీఠం సభ్యులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాయపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బల్లిపాడు ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న సీడీపీఓ

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

ఇరగవరం: పుట్టిన అరగంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని, ముర్రిపాలలో కొలెస్ట్రామ్ విటమిన్ ఏ పోషకాలు అధిక మోతాదులో ఉండడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యాంబ తెలిపారు. మండలంలోని కావలిపురం, రేలంగి గ్రామాల్లో మంగళవారం తల్లిపాల వార్సోవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాణిక్యాంబ మాట్లాడుతూ బిడ్డకి ఆరు నెలల నిండే వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తల్లిపాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిగిరి రెడ్డి, ఎంపీహెచ్ఇలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ నాగబాబు

తణుకు అర్బన్: కీటకజనిత వ్యాధులపై క్షేత్రస్థాయి ఉద్యోగులంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వై.నాగబాబు అన్నారు. ఆశాడే సందర్భంగా మంగళవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నిరంతర ఫీవర్ సర్వే చేయాలని, ఇదే సందర్భంలో గృహ దర్శనాల్లో దోమ లార్వా గుర్తించి సదరు గృహవాసులచే తొలగింప చేయించాలని సూచించారు. ముఖ్యంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రామాణికంగా నిర్వహించాలని, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో పారిశుద్ధ్య సమస్యలను పొందుపరచాలని స్పష్టం చేశారు. నీటి జనిత వ్యాధులైన అతిసారం, టైఫాయిడ్, జాండిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా చేతుల శుభ్రత, ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై విధిగా మూతలు ఉంచడం, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ కెఎంఆర్ కిషోర్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి.హెచ్. ఉదయలక్ష్మి, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జవీ వీఎస్ఎన్ మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీలు, వార్డు విలేజ్ హెల్త్ సెక్రెటరీలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



తాడేపల్లిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

తాడేపల్లిగూడెం: జర్నలిస్టులకు వెంటనే కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఏపీయుడబ్ల్యూజే పిలుపు మేరకు మంగళవారం జిల్లాశాఖ, జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ కొత్త అక్రిడేషన్లు ఇవ్వకపోవడంతో పాత్రికేయులు అనేక విధాలుగా నష్ట పోతున్నారన్నారు. తక్షణమే నూతన అక్రిడేషన్ల పాలసీని ప్రకటించి కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా, ప్రమాదబీమా, ఇళ్ల స్థలాలు, పెన్షన్ వంటి సదుపాయాలను కల్పించాలన్నారు. అనంతరం ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

తణుకులో

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు 3 సెంట్ల భూమి హామీతో పాటు కొత్త అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ బుచ్చిబాబు, ఏపీడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తులా భాస్కర్, కొడమంచిలి కృష్ణలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



తణుకులో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి

తణుకు అర్బన్: ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లలో యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. తణుకులో ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాబాయి తణుకు సుధ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ ఎల్2 క్లినిక్, ఏఆర్‌టీ బ్యాంక్, సరోగసి కేంద్రాన్ని, సుప్రజ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ లెవెల్ 2, ఏఆర్‌టీ బ్యాంక్‌లోని విష్ణుప్రియ టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్ ఏఆర్‌టీ లెవెల్ 1లో అందుతున్న సేవలు, వసతులను పరిశీలించారు. అనంతరం సత్యవతి నర్సింగ్ హోం, భాగ్యశ్రీ ఆసుపత్రిలలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్ కోసం వేచి ఉన్న గర్భిణులను ఆరా తీశారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు



అత్తిలిలో వాట్సాప్ గవర్నెన్స్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఇన్చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

అత్తిలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాట్సాప్ గవర్నెన్స్ గురించి ప్రజలకు తెలిసేలా ర్యాలీలు నిర్వహించి విస్తృతంగా అవగాహన కల్పించాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు మంగళవారం అత్తిలి గ్రామంలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అత్తిలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి అత్తిలి మెయిన్ సెంటర్ వరకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నేటి నుంచి జిల్లాలో ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్‌పై అవాహన కల్పించి సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. జిల్లాలో 535 గ్రామ సచివాలయాల్లో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు అవగాహన కలిగించడానికి భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు వేల అప్లికేషనులు వాట్సప్ ద్వారా రావడం జరిగియాని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 50 శాతం వాట్సప్ సేవలను పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె. మురళీకృష్ణ, తహసీల్దార్ వంశీ, ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పెంటపాడు: రైతులు సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన పొందాలని రైతు శిక్షణ కేంద్ర ఏడీఏ ఆర్. గంగాధర్ పేర్కొన్నారు. రాష్ట్రీయ కృషి వికాశయోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆకుతీగపాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి చీర్ల రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ గంగాధర్, ఏవో రవి కుమార్‌లు రైతులకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. విచక్షణ రహితంగా పురుగుమందుల వాడకం వల్ల చేలు దెబ్బతింటాయన్నారు. దిగుబడి గణనీయంగా తగ్గుతుందన్నారు. సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు కొణతాల, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



తాడేపల్లిగూడెంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, అదనపు భారాలైన ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మామిడి దాన వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రజలపై అదనపు భారాలు వద్దు అంటూ నిరసన కార్యక్రమం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అంటూ ప్రజలలోకి వెళ్లి నేడు అధికారంలోకి వచ్చాక, స్మార్ట్ మీటర్లు ఎంతో ఉపయోగమని చెబుతున్నారని, శోచనీయమని కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు బి.దుర్గా ప్రసాద్, చంద్రశేఖర్, రాంబాబు, నాని, రాజు, సుబ్రహ్మణ్యం, శేఖర్, రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు విరమించుకోవాలి

తణుకు అర్బన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం, ట్రూ అప్ చార్జీలు పెంచడాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని రాష్ట్ర ప్రజా సంఘాల నాయకులు బి. బలరాం, కోనాల భీమారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో ×ప్రజా వేదిక × అపార్ట్‌మెంట్, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు, విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడారు. గతంలో నారా లోకేష్ స్వయంగా స్మార్ట్ మీటర్లు పగలు కొట్టమని చెప్పి నేడు ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. అప్పుడు ప్రతి పక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించింది నేడు అధికారంలోకి రాగానే ఎలా మంచిది అయ్యిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, నేడు దానికి విరుద్ధంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దాని నాగరాజు, సికిలే పుష్పకుమారి, పీవీ ప్రతాప్, అడ్డగర్ల అజయ కుమారి, గుబ్బల గోపి, పి. అమ్మిరాజు, జి.వెంకటేశ్వరావు, ఎం.రమేష్, వల్లూరి వెంకటేశ్వరావు, గార రంగారావు, కామన మునిస్వామి, పీఎల్, నర్సింహారావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ఇరగవరం: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం ఇరగవరం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్య ఐక్యవేదిక నాయకుడు కామన మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీట్లలను వ్యతిరేకిస్తూ ఇప్పుడు స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రోత్సహించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా వేదిక సంఘాలు నాయకులు ఇల్లందపరతి సత్యనారాయణ, రామాంజనేయులు, కోటేశ్వరరావు, దంపనబోయిన కనకేశ్వరరావు, గుతులశివయ్య, కడలి ఏడుకొండలు, దిద్ది గంగయ్య, పాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్ని మోసగించడమే...!

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు పగలకొట్టండి అని చెప్పిన నారా చంద్రబాబునాయుడు, లోకేష్‌లు నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత మీటర్ల బిగింపునకు సిద్ధం కావడం ప్రజల్ని మోసగించడమేనని సీపీఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, మండల నాయకుడు కండెల్లి సోమరాజు విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందానిన రద్దు చేయాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కండెల్లి రమేష్‌బాబు, గాదినాయుడు, గజ్జరపు వెంకటేశ్వరరావు, ఆర్. గణేష్, తోట వెంకటేశ్వరరావు, ఆరేపల్లి సత్యనారాయణ, ఈదర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.